

ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్ ప్రక్రియ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కలక్టర్ ఎం. విజయ సునీత తన ఓటు హక్కును పాడేరులో వినియోగించు కున్నారు. కలక్టర్ బంగ్లాకు సమీపంలో ఉన్న శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఆశ్రమ బాలికోన్నత పాటశాలలో ఓటుహక్కును వినియో గించుకున్నారు. ఉదయము 07.00 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ సరళిని పరిశీలించిన కలక్టర్ అనంతరం తనఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం అని ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని, సిబ్బంది విధులను పర్యవేక్షించారు.

వెబ్ కేస్టింగ్‌ను సాధారణ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణ

పాడేరు : జిల్లా కేంద్రము కలక్టరేట్ జిల్లా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వెబ్

కేస్టింగ్‌ను సాధారణ పరిశీలకులు కె.వివేకా నందన్, జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం.విజయ సునీత, సబ్ కలక్టర్ ధాత్రి రెడ్డి పరిశీలించి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. అదేవిధంగా సెక్టార్ అధికారులకు, రూటు అధికారులకు పోలింగ్ అనంతరం రక్షణతో సురక్షితంగా తిరిగి రిసేప్షన్ కేంద్రానికి చేరుకునేందుకు తగు సూచనలు జారీ చేశారు.

జేసీ సందర్శన : పాడేరు రిటర్నింగ్ అధికారి జేసి భావన వసిష్ట్ జీ. మాడుగుల మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. జీ. మాడుగుల మండలం సెక్టార్ 42లో గల 234,

236, 238, 240, 243, 244, 245 నంబర్లు గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఈ సంరభంగా జేసి మాట్లాడుతూ ఓటర్లకు పలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని ఓటు హక్కు వినియోగంపై చైతన్య పరిచామని ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించి కనీసం 85 శాతం పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం పరిరక్షణ : అభ్యర్థులు భాగ్యలక్ష్మి, తనుజారాణి

చింతపల్లి : ఓటుతోనే ప్రజాస్వామ్యం

పరిరక్షించబడుతుందని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి , ఆ పార్టీ అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మ తనూజరాణిలు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం చింతపల్లి వచ్చిన ఓటు హక్కును వినియోగించుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, వైకాపా శ్రేణులతో కలసి మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందన్నారు. ఈ ఓటు హక్కు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి చేతిలో పాశుపతాస్త్రం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకొని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. గడచిన ఐదేళ్ల వైకాపా పరిపాలనకు ఓటర్లు బ్రహ్మరథం పడుతున్నా రన్నారు. ఈ ఎన్నికలలో వైకాపాకు ఏకపక్ష ఓటింగ్ జరుగుతుందని, రాబోయేది వైసీపీ ప్రభుత్వమే అని వారు జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ అనూష దేవి, సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీలు దారలక్ష్మి,, జయలక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యులు ఎర్రం శెట్టి ఈశ్వరమ్మ (బుజ్జి), కామాక్షి, రాణి, అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పిడబ్ల్యుడి ఓటర్లు : అల్లూరి సీతారామరాజు

జిల్లాలో వివిధ ప్రాంతాలలో పలువురు పిడబ్ల్యుడి ఓటర్లు ఉత్సాహంగా ఓటింగులో పాల్గొన్నారు. పెదబయలు మండలం గొమంగి పోలింగ్ కేంద్రములో విభిన్న ప్రతిభా వంతుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 278వ పోలింగ్ కేంద్రములో కొట్టగుల్లి మహేష్ బాబు అనే 23 సంవత్సరముల పిడబ్ల్యుడి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాజమండ్రిలో ఓటేసిన కొత్తపల్లి గీత

అరకు : తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అరకు ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత ఓటేశారు. ఇక్కడి గాంధీపురం-2, మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్-144లో క్యూలైన్‌లో నిల్చొని తన ఓటు హక్కును వినియో గించుకున్నారు. అనంతరం రౌండ్ పార్కు వద్ద తన చేతి సిరా వేలిని చూపిస్తూ, భవిష్యత్తు తరాలకు మంచి జరగాలని కోరుకున్నారు. అంతరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధికి బాటలు వేయాలని ఆమె పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయం ఏడు గంటలకే ఆమె ఓ సాధారణ వ్యక్తిలా జనం మధ్య క్యూలైన్‌లో నించొని ఓటేయడాన్ని అక్కడివారంతా ఆసక్తిగా గమనించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేందుకు ఈ ఓటు ఓ అద్భుత అవకాశమని గీత పేర్కొన్నారు.

డోలు కట్టుకొని మరీ 15 కిలోమీటర్లు నడిచి వచ్చిన గిరిజనులు

అనంతగిరి... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయితీలోగల కొండ శిఖర గ్రామాలైన బూరుగు చిన్నకోనిలలో 150 మంది ఓటర్లు ఉన్నారు వీరు. ఓట్లు వేయాలంటే15 కిలోమీటర్ల దూరం గల పోలింగ్ కేంద్రాలకు కాలినటకన వెళ్లవలసిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ముగ్గురు వృద్ధులకు డోలీలు కట్టుకొని గ్రామస్తులందరూ ఓట్లు వేయడం కోసం పెదరాబా రొంపిల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్లకు కాళ్లు నటుకన పోలింగ్ బూతులకు తీసుకు వెళ్లారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందికార్యక్రమానికి రొంపల్లి 10వ వార్డు సభ్యుడు సోమిల అప్పలరాజు. కోటపర్తి సింహాచలం. బూరుగ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి... గిరిజనులలో ఓటింగ్ చైతన్యం పెరిగింది. ఉదయం 6.30 గంటలకు పోలింగ్

సమయానికి ముందుగానే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని బారులు తీరారు. ఓటు వేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గిరి శిఖర గ్రామాల గిరిజనులు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. మారు మూల గ్రామాల గిరిజన ఓటర్‌టకు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడానికి అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి , ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ రవాణ కష్టాలను గుర్తించి నియోజక వర్గం పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి బస్సులను, జీపులను సోమవారం ఏర్పాటు చేసారు. అధికారులు కల్పించిన సదుపాయాలను గిరిజనులు వినియోగించుకుంటున్నారు. దేవరాపల్లి మండలం చింతలపూడి నుండి గ్రామస్తులు మేడపర్తిలో ఉన్న పోలింగ్ కేంద్రానికి బస్సులో ప్రయాణించి గిరిజనులు ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. అదేవిధంగా జీనబాడు పంచాయతీ దాయర్తి గ్రామస్తులు పెదకోట గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు గుర్రాలపై, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హుకుంపేట : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా

మండలంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ ప్రారంభమైన కేంద్రాల్లో అక్కడక్కడ కొద్దిసేపు ప్రారంభంలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించినప్ప టికీ ఆ తర్వాత యధావిధిగా పోలింగ్ నమోదు కార్య క్రమం జరిగింది. మండల కేంద్రంలోని 143,144 పోలింగ్ కేంద్రలతో పాటు పలు పోలింగ్ కేంద్రాలలో అరగంట లేటుగా ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా 33 పంచాయతీలు ఉండగా 55 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగింది.ఉదయం 6 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం అధికంగా ఉండటంతో బార్లు తిరిగిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. చంటి పిల్లలను చంకలో ఎత్తుకొని మహిళ ఓటర్లు ఓటు వేసేందుకు పాల్గొన్నారు. నూతన ఓటును పొందిన గిరి యువత ఉత్సాహంగా ఓటు వేసేందుకు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియాల్సి ఉన్నప్పటికీ ఆ సమయానికి ఓటర్లు బార్లు తీరు ఉండడంతో మారు మూల పంచాయతీలలో సాయంత్రం 7 గంటల వరకు ఓట్లు నమోదు ప్రక్రియను ఎన్నికల సిబ్బంది చేపట్టారు. సాయంత్రం వర్షం కురవడంతో క్యూ లైన్ లో నిలిచిన ఓటర్లు పలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ కు అంతర్యం జరగడంతో రాత్రి 7 గంటల వరకు 59 శాతం ఓట్లు నమోదు అయ్యా యి. విద్యుత్ అంతరయం ఏర్పడ దంతో టార్చిలైట్లు వేసి మరి ఓటింగ్ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు.

వి. ఆర్. పురం.... మండలంలోని రాజుపేట పంచాయతీ మొ ద్దుల గూడెం గ్రామం నుండి రాజుపేట కాలనీ గ్రామములోని పోలింగ్ కేంద్రానికి తన మూడు చక్రాల సైకిల్ పై తన ఓటు హక్కును సద్వినియోగ పరచుకోవడం కోసం వచ్చిన కుంజబొజ్జి.



బలోరా వ్యాన్ బోల్తా... ముగ్గురు పరిస్థితి విషమం

విశాలాంధ్ర అనంతగిరి... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీలో పోలింగ్ బూత్ నెంబర్ 295లో ఓట్లు వేయడానికి వేలమామిడి సిడి వలసపాటి పెళ్లి గ్రామానికి చెందిన 35 మందినీ బొలెరో వాహనంలో ఓటు వేయడానికి తీసుకో వెళ్తున్న సమయంలో కుడియా గ్రామం వద్ద వాహనం బోల్తా కొట్టిన ప్రమాదంలో ఈ ప్రమాదంలో పాటిపల్లి గ్రామానికి చెందిన 1.ఉల్లి చిన్న 2 ఉల్లి ఎండమ్మ 3 ఉల్లి ఈశ్వరమ్మ వీరికి తీవ్రంగా గాయాలు తగడంతో మీరు పరిస్థితి విషమంగా ఉంది. వీరితోపాటు 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ముగ్గరికి నాతమైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోట్ల రూపాయలు ఐటిడిఏ నిధులు ఖర్చు పెడుతున్నా, రోడ్లు వేయకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు అవడం వల్లే ఈ ప్రమాదాలకు కారణమని, ఈ పరిస్థితి పట్ల అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టాలని మండల కార్యదర్శి ఎస్ నాగులు ఎం.జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
కావాల్సిన ప్రాంతం : కొయ్యూరు
సంప్రదించవలసిన నెం : యర్రయ్యరెడ్డి
7989138129,7386603589

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతం

- జిల్లాలో 65శాతం దాటిన పోలింగు
- ఉల్లిభద్ర ఉద్యానవనకళాశాలకు తరలించిన ఈవిఎంలు

విశాలాంధ్ర -సీతానగరం.. మండలంలోని సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 62పోలింగ్ బూతులు ఉండగా పెద్ద ఎత్తున ఓటర్లు ఉదయం నుండే క్యూలో ఉండి ఓట్లు వేశారు. పండగ వాతావరణంలో జరిగిన ఈఎన్నికల్లో పెద్దఎత్తున యువతీ యువకులు కూడా పాల్గొనడం గమనార్హం. వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తరహాలో ఈఎన్నికలు జరగడం గమనార్హం. నువ్వా నేనా అన్న రీతిలో ఎన్నికలు జరగడంతో నేతలు దగ్గర ఉండి ఓట్లను తమపార్టీలకు వేయాలని పోలింగ్ కేంద్రాలకు దగ్గరలో సైతం ప్రచారాన్ని చేపట్టారు. రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీలు ఎటువంటి టెంట్లు ఏర్పాటు చేయకపోవడం వలన ఓటర్లు ఎండల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సబ్ డివిజన్ ఏఎస్పీ సునీల్ షరోన్ లుసందర్శన చేసి సిబ్బందికి తగుసూచనలు చేశారు. మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారులైన ఎంపీడీవో ఈశ్వరరావు తహశీల్దార్ శ్రీనివాసరావు ఎస్సై రాజేష్ మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు సెక్టోరియల్ అధికారులుగా విధులు సక్రమంగా నిర్వహించి ఓటింగ్ సజావుగా జరిగేందుకు సహకరించారు. పార్వతీపురం గ్రామీణ సిఐ రవికుమార్ ఎస్సై రాజేష్ కుమార్ పోలీస్ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ చేయడం వలన ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకున్నారు. జోగంపేట గ్రామంలో పోలింగ్ బూత్ నెంబర్ 110లో ఈవిఎం మురాయించగా ఇంకోఈవీఎం తెచ్చి అమర్చడంతో గంటంపావు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైనది. ఏదేమైనా 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పార్వతీపురం శాసనసభ నియోజకవర్గంలో 8మంది అభ్యర్థులు పోటీలో ఉండగా అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో వీరి జాతకం తెలియనుంది.

ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు

పార్వతీపురం టౌన్: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, ఆయన సతీమణి కరుణ ప్రభుత్వ బ్రాంచ్ స్కూల్ (ఉన్నత పాఠశాల)లో పోలింగ్ కేంద్రం 32 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.దాదాపు గంటసేపు క్యూ లైన్‌లో నిలుచుని ఓటును వేశారు. అనంతరం మీడియతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పండగలో ఓటు హక్కును సతీసమేతంగా వినియోగించు కోవడం ఆనందంగా ఉందన్నారు.ప్రతి ఒక్కరూ తన ఆత్మ ప్రబోధం మేరకు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరుగుతోందని ఆయన చెప్పారు.

జాయింట్ కలెక్టర్ : పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక స్థానిక ప్రభుత్వ బ్రాంచి స్కూల్లో పోలింగ్ కేంద్రం 32లో ఓటుహక్కును వినియోగించు కున్నారు.

జిల్లాఎస్పీ : పార్వతీపురం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నిషాంత్ కుమార్ తన సతీమణి కరుణతో కలిసి పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.అందరి ఓటర్లతో కలిసి క్యూలైన్లో ఉండి ఓటును వేసారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ ఓటును వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పండుగ వాతావరణంలో జిల్లాప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటుహక్కును వినియో గించుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడి ఓటును వినియోగించు కోవడంపట్ల అభినందనలు తెలిపారు. జిల్లాల్లోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిదిలోగల అన్ని కేంద్రాల్లోఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నామని చెప్పారు.

సాలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో సాలూరు నియోజకవర్గంలో 57.02 శాతం పోలింగ్ నమోదయ్యింది.నియోజకవర్గంలో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయం 7 గంటలనుండే ఓటర్లు ఓట్లు వేసెందుకు క్యూ లైన్లో నిలబడ్డారు. పట్టణంలో కొన్నిచోట్ల ఈవిఎంలు సరిగా పనిచేయక పోవడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. వివాదాస్పద ఏటీబీ కొఠియా సరిహద్దు గ్రామా లలో గతంలో కన్నా అధికసంఖ్యలో పోలింగ్ జరిగింది.ఆంధ్ర, ఒడిషాలో రెండుచోట్ల వారికి ఓట్లు ఉండటంతో ఏదో ఒకచోట మాత్రమే ఓటు వేసేందుకు గతంలో ఎన్నికల కమీషన్ అనుమతి ఇచ్చేది. ఈ దఫా ఎన్నికలలో రెండు చోట్ల ఓటు వేసేందుకు వీలు కల్పించడంతో నేరేళ్లవలసలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు బారులు తీరారు. అధిక సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లో ఉండటంతో సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా పోలింగ్ కొనసాగుతుంది.

ఓటేసిన ప్రముఖులు.... సార్వత్రిక ఎన్నికల లో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికలలో సాలూరు నియోజకవర్గం నుండి ఎన్నికల బరిలో నిలిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పీడిక.రాజన్నదొర తన కుంటుంబ సభ్యులతో కలసి ప్రభుత్వ బాలికల పాఠశాలలో తన ఓటుహక్కు ను వినియోగించుకున్నారు.కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న తెదేపా అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం లో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. చింతల వీధి పోలింగ్ కేంద్రంలో జీసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, రాష్ట్ర యస్టీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి.శంకర్రావు తన కుటుంబంతో కలసి పెదపదం పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వైరిచర్ల

కురుపాం : కురుపాం శివన్న పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్ , తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు వజ్రాయుధంతో సమానం అని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని సూచించారు.

టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్ చంద్ర...

పార్వతీపురం : పార్వతీపురం శాసనసభ నియోజకవర్గ టిడిపి ఉమ్మడి పార్టీల అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర వెంకంపేట గ్రామంలో తనసతీమణితో కలిసి ఓటుహక్కును ఉపయోగించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావడంతో పాటు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రావడం తధ్యమని తేలిందన్నారు. సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. తనకు కూడా మంచి మెజార్టీతో గెలిపిస్తారని దీమాను వ్యక్తం చేశారు.

ఉద్యాన కళాశాలలో స్ట్రాంగ్ రూంలు

గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్రవద్ద గల ఉద్యాన కళాశాలలో జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు. సోమవారం

పోలింగ్ అనంతరం ఈవీఎంలు నేరుగా ఉద్యాన కళాశాలకు చేరు కుంటున్నాయి. వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్ర పరుచుటకు అన్ని ఏర్పాట్లు చేశారు. అవసరమగు సీసీ కెమెరాలు ఏర్పాటు, పెద్ద ఎత్తున పోలీసు బందో బస్తును ఏర్పాటుచేశారు. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి అందిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలో 65శాతం, పార్వతీపురం, పాలకొండనియోజక వర్గాల్లో 70శాతం, సాలూరులో 60శాతం, కురుపాంలో 62శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తుంది. పూర్తి పోలింగు వివరాలను మంగళవారం ఉదయం నాటికి అధికారులు వెల్లడిస్తామని తెలిపారు. కొన్నిచోట్లఈవిఎంలు అధికారులు సకాలంలో స్పందించి తగుచర్యలు తీసుకోవడంతో ఓటింగ్ ప్రారంభమైంది. ఏదేమైనా ఓటింగ్ శాతం పెరగడం, పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం జూన్ 4న ఫలితాలు ఎవరికీ అనుకూలమో ,ఎవరికి ప్రతిఫలమో వేచి చూడాలి మరి. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ పెద్ద ఎత్తున తనిఖీలు చేయడంతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పి డాక్టర్ దిలీప్ కిరణ్ సబ్ డివిజన్ ఏఎస్పి సునీల్ షరోన్, దిశ డిఎస్పీ హర్షిత, కృష్ణారావు, మురళీధర్ తో పాటు సిఐలు కృష్ణారావు, రవికుమార్ తదితరులు, ఎస్ఐలు ముమ్మరంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు సూచనలు తెలియజేసి పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు. ఏదేమైనా 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతముగా ముగియడంతో జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొఠియా ఘాట్‌లో ఓటర్లను తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా.....

ప్రయాణికులకు స్వల్పగాయాలు

విశాలాంధ్ర:-సాలూరు రూరల్: ఓటు వేసేందుకు వెళ్లి వస్తున్న మినీ వ్యాన్ కొఠియా ఘాట్ లో నేరేళ్లవలస వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలు సోమవారం నిర్వహించగా వివాదస్పద ఏఓబి సరిహద్దు కొఠియా గ్రూపు గ్రామాల ప్రజలకు ఆంధ్ర,ఒడిషా రాష్ట్రాలలో ఓటు హక్కు ఉంటుంది.అయితే గతంలో ఎన్నికల సందర్భంగా ఏదో ఒక చోట మాత్రమే తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండేది. ఈ దఫా ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల అధికారులు కల్పించారు. దీనితో అధిక సంఖ్యలో ఓటర్లు ఇరువైపులా ఓటు వేసేందుకు తరలి వచ్చారు. అందులో భాగంగా నేరెళ్ళవలస గ్రామానికి చెందిన పలువురు ఒడిశా ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆ రాష్ట్ర ఎన్నికల అధికారులు రణసింగి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి తిరిగి వస్తుండగా వారి గ్రామం సమీపంలో వాహనం బ్రేకులు విఫలమై ఘాట్ రోడ్డు పై నుండి పొలాల్లోకి బోల్తా కొట్టింది. విషయం తెలుసుకున్న ప్రజలు పరుగున వెళ్ళి కారులో ఉన్న వారిని బయటకు తీశారు. విషయం

తెలుసుకున్న కొఠియా సీఐ నారాయణరావు, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను, గంజాయి భద్ర మాజీ సర్పంచ్ గమ్మెల బిసు తదితరులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్వల్ప గాయాలైన కన్నమ్మ తదితరులకు ప్రాథమిక చికిత్స అందించారు.

మావోయిస్టు అడ్డాలో మెరుగైన పోలింగ్

విశాలాంధ్ర-చింతపల్లి : స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్లలో మునుపెన్నడూ లేని విధంగా బలపం పంచాయితీలో కని విని ఎరగని రీతిలో పోలింగ్ శాతం పెరిగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరొందిన బలపం పంచాయితీలో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదు అయింది. గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ ప్రాంత ఓటర్లలో చైతన్యం ఉరకలేసింది. మండలంలో మిగిలిన పోలింగ్ కేంద్రాలలో నమోదైన పోలింగ్ కంటే బలపం లో 60 శాతం పోలింగ్ నమోదు అయ్యి రికార్డ్ సృష్టించింది. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు కొండలు, కోనలు, వాగులు, వంకలు దాటి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధిక సంఖ్యలో ఓటర్లు తరలి రావడంతో ఆశించిన దానికంటే మెరుగైన పోలింగ్ శాతం బలపం పంచాయతీలో నమోదయింది.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగు ప్రశాంతంగా ముగిసింది. సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటలకు పోలింగు ముగియగా, పార్వతీపురం నియోజకవర్గంలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం ఉదయం నుండి జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ఉద్యాన కళాశాలలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షణ చేశారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పర్యవేక్షణ కొనసాగించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎండ వేడిమి తట్టుకునేందుకు టెంట్లను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసారు. పార్వతీపురంలోనే జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తన సతీమణి కరుణలు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు గంట సేపు క్యూ లైన్‌లో నిలుచుని ఓటును వేశారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని యువత, మహిళలు,వృద్ధులు, వికలాంగులు పెద్దఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగులు త్రిచక్రవాహనాలపై వచ్చి ఓటు వేసి వెళ్లడం జరిగింది. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద సహాయకులు సహాయ సహకారాలు అందించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు వారికి సహకరించి వారు సజావుగా ఓటింగ్ వేయుటకు తోడ్పాటు అందజేశారు. జిల్లాలో ఓటింగ్ ప్రశాంతంగా సజావుగా జరిగింది.

అక్కడక్కడ మొరాయించిన ఈవీఎంలు.

బారులు తీరిన ఓటర్లు... ఓటరు స్లిప్పులు అందక ఇబ్బంది పడ్డ ఓటర్లు

చింతపల్లి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ ఈవీఎం ప్యాడ్‌లు మొరాయించి ఎన్నికలు సమయానికి ప్రారంభం కాలేదు. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ బూత్ ల వద్ద క్యూ కట్టారు. అధికారులు, పార్టీలకు చెందిన వారు ఓటర్లకు ఓటు స్లిప్పులు అందజేయకపోవడంతో ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఈవీఎం ప్యాడ్ లలో అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండడంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు ఈవీఎం ప్యాడ్ ల ద్వారా కొత్తగా ఓటు వేయడం వలన చాలామంది ఓటు వేసేందుకు తికమక పడ్డారు. ఓటు యొక్క విశిష్టతను అన్ని పార్టీలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో చైతన్యవంతులైన ప్రజలు అధికంగా పోలింగ్ బూతులకు క్యూ కట్టారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ ఓట్లు వేసేందుకు ఓటర్లు ఆసక్తి కనబరిచారు. మన్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ ఎన్నికలలో మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా ముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులను రాజకీయ పార్టీల నాయకులు, ఆయా పార్టీల శ్రేణులు దగ్గరుండి ఆటోలు ద్విచక్ర వాహనాలపై తీసుకువచ్చి ఓటు వేయించారు. మండల కేంద్రంలో ఓటర్ స్లిప్పులు అందక, ఓట్లు గల్లంతై సుమారు 3000 మంది ఓటర్లు నిరాశతో వెనుదిరిగారు. పలుచోట్ల మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చినప్పటికీ ఈవీఎం ప్యాడ్ లలో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో అర్థం కాకపోవడంతో పోలింగ్ మందకొడిగా సాగింది.

బెలగాం : బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై వంటి సుదీర్ఘ ప్రాంతాల నుండి సొంత గ్రామం వచ్చి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకవైపు వృత్తి రీత్యా నిత్యం బిజీగా ఉంటూ, అక్కడ నుండి వచ్చి వెళ్ళడానికి మూడు, నాలుగు రోజులు సమయం పడుతుంది. అయినప్పటికీ ఓటు వేయడం సామాజిక భాధ్యతగా యువ ఉద్యోగులు తరలిరావడం ఈసారి ఓటు వినియోగించుకోవడంలో చాలా చైతన్యం వచ్చిందనే చెప్పాలి. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండటం మరింత స్ఫూర్తినిస్తుంది.

పోలింగ్ కేంద్రాలవద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స వైద్య శిబిరాలను

జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ మేరకు ఆయన సీతానగరం మండలం బూర్జ, కెఆర్ పురం, పెదంకలాం పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాల్లో ఉంచిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య పరికరాలను పరిశీలించారు. ముఖ్యంగా డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్యలు, వాంతి, వికారం, తలనొప్పి, కీళ్ళనొప్పులు, ఆయాసం మొదలగు సమస్యలకు అవసరమైన మందులు ఉంచడం జరిగిందన్నారు. అక్కడ వైద్య సేవలు వినియోగించుకుంటున్న కొంతమందితో డిఎంఓ మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహించడం జరిగిందన్నారు. పోలింగ్ పూర్తయినంతవరకు శిబిరాన్ని కొనసాగించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

గరుగుబిల్లి : సార్వత్రిక ఎన్నికలో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ మండలంలో ప్రశాంతం వాతావరణములో జరిగింది. అయితే ఓట్లను వియోగించు కోనేందుకు ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలవద్దకు క్యూ లు కట్టి ఓటును వేసేందుకు సిద్దమయ్యారు. మండలం లో కొన్ని పోలింగ్ కేంద్రాలవద్ద ఇ. వి. ఎం లు మోరాయించడం వలన

కొంత సమయం ఆలస్యంగా ప్రారంభం అయినాయి. ఎన్నికల అధికారుల నిబంధనలు మేరకు ప్రతి కేంద్రం వద్ద మంచి నీటి వసతి, వైద్య అవసరాల నిమిత్తం ఆరోగ్యం శాఖ సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగింది. జీవన ఉపాధి నిమిత్తం పల్లెలు వదిలి దూరప్రాంతలు వెళ్లిన ప్రజలు తమయొక్క ఓటును వినియోగించుకోవడం కోసం స్వగ్రామంలకు వచ్చి తమ ఓటను వినియోగించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో ఓట్లు వినియోగించు కోవడం జరిగింది యువత పెద్ద యత్తున చైతన్యం కల్గి వృద్ధులు, వికలాంగులకు విల్ చైర్ ల సహాయంతో అధిక శాతం పాల్గొనే విధంగా జరిగింది. ఎన్నిక వేళ మండలంలో లా అండ్ ఆర్డర్కు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలింగ్ జరిగినందుకు పోలీస్ బలగాలు నిచ్చింతగా విధులు నిర్వహించారు.

కురుపాం: కురుపాం నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 268పోలింగ్

కేంద్రాల్లో సుమారు 66.57శాతం మంది ఓటర్లు తమ హక్కులను వినియోగించు కున్నారు. 194114 మంది వివిధ కేటగిరిలో 129223మంది ఉత్సాహం గా ఎన్నికల్లో పాల్గొన్నారు. సుమారు 62598 ఎన్నికలు కు దూరంగా ఉన్నారు. కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,శివన్న పేట పోలింగ్ కేంద్రాలు వద్ద కొద్ది పాటి తోపులాట వైసీపీ, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు మద్య నెలకొంటున్న సమయం లో సిఐ సత్యనారాయణ, ఎస్ ఐ షణ్ముఖ రావు పోలీసు సిబ్బంది తో ఇరువర్గాలు ను దూరంగా పంపించీ గొడవలు లేకుండా నివారించారు.గత ఎన్నికలు తో పోల్చుకుంటే ఈ సారి పోలింగ్ శాతం తగ్గింది.

రాజవొమ్మంగి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది,ఉదయం

6 గంటల నుండే ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు పోలింగ్ భూత్‌లముందు క్యూకట్టారు. అయితే కొన్నిచోట్ల ఈవిఎమ్‌లు మొరవించడంతో అధికారులు వెంటనే వాటి స్థానంలో కొత్త వాటిని ఉంచారు, మరి కొన్న చోట్ల ఓటర్లకు సరైన సౌకర్యాలు లేకపోయిన ఎండలో నిలబడి ఓటును వినియోగించుకున్నారు, మొత్తానికి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో నాలుగు మండలాలు సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాల్లో సోమవారం

పోలింగ్ చాలా ప్రశాంతంగా సాయంత్రం ఎన్నికలు ముగిసే సమయానికి 68% పోలింగ్ అయిందని ఎన్నికల అధికారులు తెలిపారు. అక్కడక్కడ చెదురు మధురు ఘటనలు తప్ప ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పాలకొండ నియోజకవర్గం లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి, కూటమి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వడాల భూదేవి ఓటు హక్కును సద్వినియోగపరచుకున్నారు.

వి. ఆర్. పురం. : మండలంలోని 29 కేంద్రాలలో సార్వత్రిక ఎన్నికలు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ,తహసీల్దార్ మౌలానా పాజిల్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. వి ఆర్ పురం, రాజు పేట కాలనీ రేఖ పల్లి తదితర పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును సద్వినియోగ పరచుకోవడం కోసం ఓటర్లు ఉదయం నుండే వందలాదిగా బారులు తీరారు. సాయంత్రానికి సుమారు మండలంలో 70% ఓటింగ్ నమోదు అయినట్లు సమాచారం పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై కే నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

చింతపల్లి : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో వృద్ధులు, వికలాంగులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఓటు హక్కు పై అవగాహన పెంచుకున్న వృద్ధులు, వికలాంగులు సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాలను డివిజన్ అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పరిశీలన

చింతపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక ఏ ఎస్ పి ప్రతాప్ శివ కిషోర్ పరిశీలించారు. స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ తో కలిసి పోలీస్ కేంద్రాలను సందర్శించిన ఆయన పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాల పహారా ను పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్ల పరిస్థితిని పోలింగ్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవడం అభినందనీయమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : అల్లూరి జిల్లా. ముంచింగి పుట్టు. మండలంలో జరిగిన

పార్లమెంటు,అసెంబ్లీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ ఆయా కేంద్రాల్లో ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 4గంటల సమయానికి పోలింగ్ అయిన ఓటింగ్ 55.85 శాతంగా నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 4గంటల తరువాత జరిగిన పోలింగ్ శాతం ఇంకా అధికారుల నుంచి తెలియరావాల్సి ఉంది.

పలు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. సుజనకోట పంచాయతీ కేంద్రంలో గల బూత్ నెం.21లో టెంట్ ఏర్పాటు చేయలేదు. దీంతో నీడ లేక భానుడి ప్రతాపంతో మండుటెండలో గంటల తరబడి క్యూలో నిలబడలేక వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు, మహిళలు, యువకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలువురు మహిళ ఓటర్లు ఎండ వేడిమికి తట్టుకోలేక గొడుగులు చేతబట్టుకుని క్యూలో నిలబడ్డారు.

పలు చోట్ల ఓటర్ల ఫిర్యాదుతో ఆగమేఘాలతో టెంట్లు, తాగునీరు సౌకర్యం కల్పించారు. అలాగే మండలంలోని గుమ్మశిరగంపుట్టు గ్రామానికి చెందిన సుమారు 110మంది ఓటర్లు 7కిలోమీటర్ల దూరంలో గల పనసపుట్టు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పోలింగ్‌కి అడ్డంకిగా మారిన భారీ వర్షం

తడుస్తూ క్యూలైన్‌లోనే ఓటర్లు

జీ కే వీధి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 56 పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఏడు గంటలకి మొదలు కావాల్సి ఉండగా ఒకటి రెండు ఈవీఎం మొరాయించడంతో ఎనిమిది 30 నిమిషాలకు ప్రారంభమైన పోలింగ్ సజావుగా సాగింది. మండుటెండలు ఉండగా ఓటర్లుకు సరైన వసతులు కల్పించకపోవడం వల్లన అధికారులు విఫలమయ్యారు. మండలంలోని కొత్తపాలెం పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు 45 నిమిషాలకు ముగిసింది. మధ్యాహ్నం మూడు గంటలకు భారీ వర్షం కురవడంతో ఓటర్లు వినియోగించుకునేందుకు కొంత ఇబ్బంది పడ్డారు. సమయం ముగుస్తుండగా భారీ వర్షం లోను క్యూలో నిల్చుని వేచి చూశారు. క్యూలైన్లో ఉండేవారికి ఓటు వేసే అవకాశం కల్పించడంతో వర్షం కురిసిన తర్వాత పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

రంపచోడవరం : రంపచోడవరం ఏజన్సీ డివిజన్ లో 11మండలాల్లో

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సుమారు 399 పోలింగ్ బూత్‌లలో సుమారు 2,77,317 మంది స్త్రీ పురుషులు ఓటర్లు ఉండగా జరిగిన పోలింగ్ లో 1,56,311మంది స్త్రీ పురుషులు ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకోగా నిర్ణీత సాయంత్రం 4గంటల వరకు జరిగిన పోలింగ్ లో సుమారు 56.55శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు చింతూరు రంపచోడవరం డివిజన్ లలో కూనవరం మారేడుమిల్లి అడ్డతీగల మండలాల్లో ఒకటి రెండు చోట్ల ఈ వి ఏం లు తాత్కాలికంగా మోరాహించిన ఆ తర్వాత ఎన్నికలు సజావుగా సాగాయి. అక్కడక్కడా చిన్నా చిదక గొడవలు జరిగినా తర్వాత సద్దుమణిగాయి. రంపచోడవరం డివిజన్ వై రామవరం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణ సిబ్బంది తరలింపుకు హెలికాప్టర్ ను ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేపట్టింది నిర్ణీత సమయం ముగిసినప్పటికి ఓట్లు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించటం తో ఓటర్లు అధిక స్థాయిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు...

పార్వతీపురం : పార్వతిపురం శాసనసభ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఓటు హక్కును బలిజిపేట మండలంలోని చిలకలపల్లి గ్రామంలో వినియోగించుకున్నారు ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు తనకు కూడా నియోజకవర్గంలో అఖండ మెజార్టీ వస్తుందని ధీమాను వ్యక్తంచేశారు.

సీలేరు : ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలలో తన అభిమాన నాయకుడిని గెలిపించుకోవడం కోసం తన బాధ్యతగా ఓటు వేయడానికి జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ డబ్బకోట గ్రామం నుంచి ఆరు కిలోమీటర్లు తను నడవలేక పోయినప్పటికి తన మూడు చక్రాల వాహనంలో కిముడు అర్జున్ దారకొండ వచ్చి ఓటు హక్కుని వినియోగించుకొని అందరి మన్ననలను పొందాడు. ఓటుకున్న విలువ ఏంటో తను ఓటు వేసి చూపించాడు.

ఆంధ్రా ఒడిశా సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీస్ అధికార్లు, ఎన్నికల సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన జీకేవీధి

మండలం సీలేరు, దారకొండ, గాలికొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణ పోలీసులకు, పోలింగ్ సిబ్బందికి కత్తి మీద సాములాంటిదే. ఎన్నికలు సంబంధించి బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది ఈ ప్రాంతాలకు వచ్చి ఓటింగ్ ప్రక్రియ ముగిశాక తిరిగి కేంద్రానికి చేరేంత వరకు పోలీసులకు, ఇటు ఎలక్షన్ అధికర్లకు టెన్షన్‌గా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో వీరికి ఎన్నికల నిర్వహణ పెను సవాల్ గా ఉంటుంది. ఏఓబిలో ఎన్నికల్లో సంఘ విద్రోహశక్తుల నుంచి ఆటంకాలు ఎదురుకాకుండా ఉండేందుకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి పోలీస్ శాఖ ఈ ప్రాంతాలపై అధికంగా దృష్టిసారించి గ్రౌహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలు, సీఆర్పీఎఫ్ బలగాలచే ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి ఈ ప్రాంతాన్ని తమ ఆదీనంలోకి తెచ్చుకుంటారు. రాత్రింబవళ్లు బలగాలు అటవీ ప్రాంతంలోనే సాగా వేగి ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడంతో ప్రశాంత వాతావరణంలో సోమవారం ఎన్నికలు ముగిశాయి.